- జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏర్పాట్లు పూర్తి
- బరిలో 19 మంది అభ్యర్థులు, 16,40,755 మంది ఓటర్లు
- 1973 పోలింగ్ కేంద్రాలు, 9376 పోలింగ్ సిబ్బంది
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు, పోలింగ్ సిబ్బంది
- ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుల భారీ బందోబస్తు
- జహీరాబాద్‌లో హ్యాట్రిక్ గెలుపుపై బీఆర్ఎస్ ధీమా

సంగారెడ్డిలోని అంబేద్కర్ గ్రౌండ్‌లో పోలింగ్ సామగ్రిని సరి చూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్‌కు వేళాయె

పార్లమెంట్ పోలింగ్‌కు సర్వం సిద్ధం

సంగారెడ్డి, మే 12(నమస్తే తెలంగాణ) : జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1973 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రంకు ఈవీఎంలు, పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఓటింగ్ జరగనుంది. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి ఎన్నికల ఏర్పాట్లను ఆదివారం సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా ఓటర్లను ఆమె కోరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ 2500 మందికిపైగా పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నారాయణఖేడ్, అందోలు, జహీరాబాద్, బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లోని 16,40,755 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగిం చుకోనున్నారు. జహీరాబాద్ పరిధిలో మొత్తం 16,40,755 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,01,563 మంది పురుష, 8,39,133 మ హిళా ఓటర్లు ఉన్నారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల అధికారులు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 1973 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జుక్కల్‌లో 255, కామారెడ్డిలో 266, ఎల్లారెడ్డిలో 270, బాన్సువాడలో 258, అందోలులో 313, నారాయణఖేడ్‌లో 298, జహీరాబాద్‌లో 313 పోలింగ్ కేంద్రాలను ఏ ర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణలో 2344 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 2344 అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 4688 ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొంటున్నారు.

హ్యాట్రిక్ గెలుపుపై బీఆర్ఎస్ ధీమా

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించటం ఖాయమని బీఆర్ఎస్ ధీమాగా ఉంది. జహీరాబాద్ పార్లమెంట్ బరిలో 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, కాంగ్రెస్ నుంచి సురేశ్ షెట్కార్, బీజేపీ నుంచి బీబీ పాటిల్ పోటీ చేస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వరుసగా రెండుమార్లు ప్రజలు బీఆర్ఎస్‌కు పార్టీకి పట్టం కట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ సామాజికవర్గానికి చెందిన గాలి అనిల్‌కుమార్‌ను బరిలో నిలిపింది. గాలి అనిల్‌కుమార్ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటర్లను కలిసి గెలిపించాల్సిందిగా కోరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు

హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు గాలి అనిల్‌కుమార్ గెలుపుకోసం ప్రచారం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ బలంగా ఉండటంతో పాటు ప్రజలు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలపై వ్యతిరేకతతో ఉన్నారు. పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం జహీరాబాద్ పార్లమెంట్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని ఓటర్లు అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ప్రజలకు అందుబాటులో ఉండరు అన్న అపప్రథ ఉంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చలేదు. ఆరు గ్యారంటీలు, 420 హామీలను నిలబెట్టుకోవటంలో కాంగ్రెస్ విఫలమైంది. దీంతోప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపడం లేదు. తెలంగాణ, జహీరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్న బీఆర్ఎస్ వైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారు. దీంతో జహీరాబాద్ పార్లమెంట్‌లో మూడోసారి బీఆర్ఎస్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

సంగారెడ్డి నుంచి బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



పర్యవేక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి నుంచి పోలింగ్ సామగ్రితో వెళ్తున్న ఎన్నికల అధికారులు

మోదీ ఛరిష్మానే నమ్ముకున్న బీజేపీ

- బీబీ పాటిల్ అభ్యర్థిత్వంపై అసంతృప్తి
- జహీరాబాద్‌లో పార్టీకి కానరాని జనాదరణ
- నేతల్లోను సమన్వయలోపం
- ప్రచారం చేయని స్టార్‌క్యాంపెయినర్లు

సంగారెడ్డి, మే 12(నమస్తే తెలంగాణ): జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీకి జనాదరణ కనిపించటంలేదు. మోదీ ఛరిష్మాను నమ్ముకున్న బీజేపీకి జహీరాబాద్‌లో చుక్కెదురుకానుంది. మోదీ స్వయంగా ప్రచారం చేసినా ప్రజల్లో ఆశించిన ఆదరణ కనిపించటంలేదు. దీనికితోడు బీబీ పాటిల్ అభ్యర్థిత్వంపైనా సొంత పార్టీతోపాటు ప్రజల్లో అసంతృప్తి కనిపిస్తున్నది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి నుంచి బీజేపీ అంత బలంగా లేదు. దేశ వ్యాప్తంగా మోదీ హవా కొనసాగుతుందని బీజేపీ ప్రచారం చేసినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆపార్టీ చతికిలపడింది. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క కామారెడ్డిలో మాత్రమే బీజేపీ గెలుపొందింది. సంగారెడ్డి జిల్లా పరిధిలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లో ఎక్కడా అసెంబ్లీ ఎన్నికల్లో గెలవలేదు. టికెట్ కేటాయింపు నుంచే పార్టీలో అసంతృప్తులు మొదలయ్యాయి. జహీరాబాద్ పార్లమెంట్ టికెట్‌ను పలువురు బీజేపీ నేతలు ఆశించారు. అయితే అధిష్టానం ప్యారాచూట్ నేత బీబీ పాటిల్‌కు ఎంపీ టికెట్ కట్టబెట్టింది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన బీబీ పాటిల్‌కు టికెట్ ఇవ్వటంపై బీజేపీ నేతల్లో అసంతృప్తి ఉంది. ఎంపీగా బరిలో దిగిన బీబీ పాటిల్‌కు బీజేపీ ముఖ్యనేతలు సహకరించటంలేదని తెలుస్తుంది. జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో ఎక్కడా కేంద్రమంత్రులు, బీజేపీ అగ్రనేతలు ప్రచారం చేయలేదు. బీబీ పాటిల్ ఒక్కరే ప్రచారం చేశారు. బీజేపీ అధిష్టానం ఇన్‌చార్జిగా నియమించిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సైతం ప్రచారంలో కనిపించలేదు. మోదీ బహిరంగ సభ మినహా ఇంటింటి ప్రచారంలో కానీ రోడ్‌షోలలో కానీ పాల్గొనలేదు. ముఖ్యనేతలే ప్రచారానికి దూరంగా ఉండటంతో కార్యకర్తలు సైతం నామ్‌కేవాస్తేగా ప్రచారంలో పాల్గొన్నారు. మరోవైపు బీబీ పాటిల్ సొంత మనుషుల పెత్తనం బీజేపీ నేతలకు మింగుడు పడటంలేదని తెలుస్తుంది.

బీబీ పాటిల్ అభ్యర్థిత్వంపై అసంతృప్తి?

పదేళ్ల పాటు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ప్రజలకు అందుబాటులో ఉండరన్న అపవాదు ఉంది. దీనికితోడు పదేళ్ల కాలంలో బీబీ పాటిల్ జహీరాబాద్ అభివృద్ధికి ఏమీ చేయలేదన్న అసంతృప్తి ప్రజల్లో ఉంది. బీబీపాటిల్ పదేళ్లు ఎంపీగా పనిచేసినప్పటికీ కేంద్రం నుంచి ఎలాంటి నిధులు తీసుకురాలేదు. పెద్ద ప్రాజెక్టులు, కొత్త రైల్వే లైన్‌లను సాధించటంలో విఫలమయ్యారన్న అసంతృప్తి ప్రజల్లో ఉంది. కనీసం జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాలకు నవోదయతోపాటు కేంద్రీయ విద్యా సంస్థలను కూడా బీబీ పాటిల్ తీసుకురాలేకపోయారు. మోదీ ఛరిష్మా, అయోధ్య రాముడు తనను ఎన్నికల్లో గట్టెక్కిస్తారని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ కనిపిస్తున్నారు. లింగాయత్ ఓటర్లు తనకు మద్దతుగా నిలుస్తారని నమ్మకంగా ఉన్నారు. అదే సామాజికవర్గానికి చెందిన సురేశ్‌షెట్కార్ బరిలో ఉండటంతో లింగాయత్‌ల ఓట్లు చీలిపోయే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

విద్యుత్‌నగర్‌లో స్వల్ప ఉద్రిక్తత

రామచంద్రాపురం, మే 12: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నాయకుడు మల్లేపల్లి సోమిరెడ్డి ఓటర్లకు పైసలు పంచుతున్నారనే అనుమానంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు ఆయన నివాసం వద్ద కాపుకాసి ఉన్నారు. దీంతో ఇరు పార్టీల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బందోబస్తుతో సోమిరెడ్డి నివాసం వద్దకు వచ్చారు. అయితే అక్కడ ఓటర్లకు ఎలాంటి పైసలు పంచడం లేదు, ఆయన నివాసంలో ఓటర్ స్లిప్‌లను పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు పైసలు పంచుతున్నట్లు ఎలాంటి ఆధారాలేకుండా ఇష్టానుసారంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం.. పోలీసులు

బీఆర్ఎస్ నేత సోమిరెడ్డి నివాసం సమీపంలో మోహరించిన పోలీసులు

వెంటనే బందోబస్తుతో తన నివాసం వద్దకు రావడం సరికాదని మండిపడ్డారు. ఓటర్లకు పైసలు పంచాల్సిన అవసరం తమకు లేదని, అనుమానం ఉంటే చెక్ చేసుకోవాలన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేస్తూ విడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గి ఇరు పార్టీల వారికి నచ్చజెప్పి అక్కడినుంచి పంపించారు.

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 12: ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన ఆర్సీపురంలోని తన సోదరుడి నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ మెదక్ జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి ప్రజలకు ఎన్నో సేవలు అందించారని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి లాంటి విద్యావేతను నిలబెట్టడం చాలా సంతోషమన్నారు. ప్రజల కోసం కొట్లాడే బీఆర్ఎస్‌కే ప్రజలు మద్దతు తెలుపాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే మనకు

మాట్లాడుతున్న ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి

ఒరిగేది ఏమి ఉండదన్నారు. పార్టీ అభ్యర్థి విజయం కోసం కష్టపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తలకు ధన్యావాదాలు తెలిపారు. సమావేశంలో ఆదర్శ్‌రెడ్డి, అంజయ్య, పరమేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణగౌడ్, గౌస్, కుతుబ్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కోహీర్: సౌకర్యాల కల్పనపై అసహనం వ్యక్తం చేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు: ఎన్నికల సామగ్రితో వెళ్తున్న అధికారులు

జిన్నారం: కిష్టయ్యపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు

నారాయణఖేడ్‌లో గాలివానకు కూలిన టెంట్లు

గాలి వాన బీభత్సం

నిజాంపేట్/కోహీర్ మే 12: గాలివన బీభత్సం సృష్టించింది. ఆదివారం మండల కేంద్రమైన నిజాంపేట్‌లో కాలేరు చరణ్‌కు చెందిన మీసేవ, మినీ బ్యాంక్, బైక్ స్పేర్‌పార్ట్స్ మెకానిక్ షాప్ పైకప్పులు కొట్టుకుపోయాయి. దామరచెరులో గొల్ల సంగయ్యకు చెందిన ఇంటి పైకప్పు ఎగిరిపోవడంతో నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. కోహీర్ పట్టణంతోపాటు కవేలి, కొత్తూర్, దిగ్వాల్, మద్రి, చింతల్‌ఘాట్, వెంకటాపూర్ గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది.

నిజాంపేట్: దామరచెరులో ఎగిరిపోయిన ఇంటిపైకప్పు

జహీరాబాద్ గులాబీ కంచుకోట

తెలంగాణ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ గెలుపు.. హ్యాట్రిక్ విజయంపై బీఆర్ఎస్ ధీమా

- ఇటీవల అందోల్‌లో నిర్వహించిన కేసీఆర్ బహిరంగసభ విజయవంతం
- బీఆర్ఎస్ గెలుపు కోసం కేసీఆర్, హరీశ్‌రావు సుడిగాలి పర్యటనలు
- కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను ఎండగడుతూ రోడ్‌షోలు

సంగారెడ్డి, మే 12(నమస్తే తెలంగాణ): జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ కంచుకోట. తెలంగాణ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ విజయకేతం ఎగురవేస్తూ వస్తున్నది. జహీరాబాద్‌లో హ్యాట్రిక్ గెలుపుపై బీఆర్ఎస్ ధీమాగా ఉన్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేండ్లు సీఎంగా ఉన్న సమయంలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవకర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను గమనిస్తున్న జహీరాబాద్ పార్లమెంట్ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రచారం సాగించారు. ఇటీవల అందోలు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో లక్ష మందితో బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహించింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. బీఆర్ఎస్ పదేండ్ల హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలకు వివరించారు. జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు అవశ్యకతను ప్రజలకు వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల బీఆర్ఎస్ అధినేత జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డిలో బస్సుయాత్ర చేపట్టగా భారీ స్పందన వచ్చింది.

జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి బాటలువేసిన కేసీఆర్

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన 2008లో జరిగింది. దీంతో కొత్తగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అవతరించింది. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ కేంద్రంగా జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాలు,కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలతో జహీరాబాద్ లోక్‌సభ స్థానం ఏర్పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో తొలిసారి జహీరాబాద్‌లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014, 2019లో జరిగిన రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. జహీరాబాద్ పార్లమెంట్‌పై కేంద్రంలోని ప్రభుత్వాలు శీతకన్ను వేసినా కేసీఆర్ సర్కార్ మాత్రం అభివృద్ధికి పెద్దపీట వేసింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు కేసీఆర్ సర్కార్ వందలకోట్ల నిధులను ఖర్చుచేసింది. జహీరాబాద్‌లో నిమ్జ్ ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. నిమ్జ్ ఏర్పాటు కోసం భూసేకరణ చేపట్టడంతోపాటు మౌలిక వసతులు కల్పించింది. నిమ్జ్‌లో డిఫెన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి సంబంధించి పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. దీంతో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కేసీఆర్ సర్కార్ రూ.2653 కోట్లతో సంగమేశ్వర ఎత్తిపోతల పథకం ప్రారంభించింది. ఈపథకం పూర్తయితే జహీరాబాద్, అందోలు నియోజకవర్గాల్లో 1.69 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. అలాగే రూ.1774 కోట్లతో బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ సర్కారు ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అందోలు, నారాయణఖేడ్ నియోకవర్గాల్లో 1.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. రైతులకు మేలుచేసే రెండు సాగునీటి పథకాలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిలిపివేసింది.



బీఆర్ఎస్ వెన్నంటే జహీరాబాద్ ప్రజలు

జహీరాబాద్ ప్రజలు బీఆర్ఎస్ వెన్నంటే ఉన్నారు.జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్‌కు పట్టు ఉన్నది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రజలుపార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తూ వచ్చారు. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాంగ్రెస్‌పై 1,44,631 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. 2019లోనూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాంగ్రెస్‌పై 6229 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జహీరాబాద్ పార్లమెంట్ నుంచి తెలంగాణ ఉద్యమకారుడు, రైతుబిడ్డ అయిన గాలి అనిల్‌కుమార్‌ను బరిలో దింపారు. తనను ఎంపీగా గెలిపిస్తే జహీరాబాద్ పార్లమెంట్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయటంతోపాటు ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తానని ప్రజలకు చెబుతూ మద్దతు కూడగడుతున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉన్న జహీరాబాద్‌లో బీఆర్ఎస్ పట్టు ఎక్కువగా ఉంది. దీంతో ఇక్కడ ఎక్కువగా ఉండే బీసీ, ఎస్సీ, మైనార్టీ ఓటర్లు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవనున్నారు. అందోలు, నారాయఖేడ్ ఓటర్లూ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మహిళలు, యువత, రైతులు,కార్మికులు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారు.

2024 ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు

2024 జహీరాబాద్ పార్లమెంట్ బరిలో 19 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీల నుంచి గాలి అనిల్‌కుమార్(బీఆర్ఎస్), సురేశ్ షెట్కార్(కాంగ్రెస్), బీబీ పాటిల్(బీజేపీ) పోటీ చేస్తున్నారు. రిజిస్టర్ పార్టీల నుంచి కొత్త బలిజ బస్వరాజ్ (తెలంగాణ ప్రజాశక్తి పార్టీ), గుర్రపు మచ్చేందర్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), చావగాని మణి (ఆలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ), టీడీఎస్.మణి (ధర్మసమాజ్ పార్టీ), మోహన్‌రెడ్డి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), దుర్గయ్యి (ఇండియా ప్రజాబంధ పార్టీ) ఎంపీగా పోటీ చేస్తున్నారు. వీరితో పాటు 10మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు శాపంగా ప్రభుత్వ వైఫల్యాలు

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఆ పార్టీల అభ్యర్థులకు శాపంగా మారుతున్నాయి. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 13 హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నది. సాగునీరు, కరెంటు, రైతుబంధు, పంటనష్టం ఇవ్వకుండా రైతుల ఉసురు తీస్తున్నది. కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. తాగునీటి కష్టాలు మొదలు కావటంతో ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు సిద్ధం అవుతున్నారు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న బీబీ పాటిల్‌పై సొంత పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవుతున్నది. దీనికితోడు పదేండ్లు ఎంపీగా పనిచేసిన బీబీపాటిల్ జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి కోసం ఏమాత్రం పనిచేయలేదన్న అసంతృప్తి బలంగా ఉంది. దీంతో ఓటర్లు బీబీపాటిల్‌కు ఓటు వేసే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. దీనికితోడు జహీరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీకి బలం అంతగా లేదు. గత ఎన్నికల్లో బీజేపీ చెప్పుకోదగ్గ స్థాయిలో ఓట్లు పడలేదు. దీంతో ఎన్నికల్లో బీజేపీ గెలుపు అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి.

జహీరాబాద్ పార్లమెంట్ లో బీఆర్ఎస్ ఓటింగ్

సంవత్సరం	పార్టీ	పోలైన ఓట్లు	ఓటింగ్ శాతం
2009	బీఆర్ఎస్	3,78,360	37.19
2014	బీఆర్ఎస్	5,08,661	46.46
2019	బీఆర్ఎస్	4,34,244	41.58

2014 ఎన్నికల ఫలితాలు

అభ్యర్థి	పార్టీ	ఓట్లు	శాతం
బీ.బీ.పాటిల్	బీఆర్ఎస్	508661	46.46
సురేష్ షెట్కార్	కాంగ్రెస్	364030	33.25
కె.మదన్‌మోహన్	టీడీపీ	157497	14.39

గెలుపు: బీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ 1,44,631 ఓట్ల మెజార్టీతో విజయం

2019 ఎన్నికల ఫలితాలు

అభ్యర్థి	పార్టీ	ఓట్లు	శాతం
బీ.బీ.పాటిల్	బీఆర్ఎస్	434244	41.58
మదన్‌మోహన్‌రావు	కాంగ్రెస్	428015	40.98
బి.లక్ష్మారెడ్డి	బీజేపీ	138947	13.30

గెలుపు: బీఆర్ఎస్ అభ్యర్థి బీబీపాటిల్ 6229 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

2024 జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
జుక్కల్	202769	99474	103286	9
బాన్సువాడ	196691	93688	102990	13
ఎల్లారెడ్డి	223009	106876	116131	2
కామారెడ్డి	254626	122306	132301	19
నారాయణఖేడ్	237241	118859	118373	9
అందోలు	205857	122666	128186	5
జహీరాబాద్	275562	137694	137866	2
మొత్తం	16,40,755	8,01,563	8,39,133	59